సాక్షి అనకాపల్లి

బుధవారం ၊ 23 ၊ అక్టోబర్ ၊ 2024



తుఫాను ఎఫెక్ట్.. పలు రైళ్ల రద్దు

దానా తుఫాను కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

8లో



ప్రాజెక్టులకు నిధులివ్వాలి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఏపీ సమగ్ర అభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ అన్నారు.

8లో

వాతావరణం



అనకాపల్లి : రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 23న 2 మి.మీ, 25న 1 మి.మీ, 26న 5 మి.మీ, 27న 3 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.2 నుంచి 35.1 వరకూ, గాలి గంటకు 3 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

డిస్టిలరీలో సీఐడీ తనిఖీలు



సుందరయ్యపేటలో సీఐడీ అధికారులు తనిఖీలు చేస్తున్న విశాఖ డిస్టిలరీ పరిశ్రమ

కశింకోట: సుందరయ్యపేటలో గల విశాఖ డిస్టిలరీ పరిశ్రమలో సీఐడీ అడిషనల్ ఎస్పీ ప్రేం కాజల్ నేతృత్వంలో ఆకస్మిక తనిఖీలు మంగళవారం రాత్రి వరకూ కొనసాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి ఇక్కడ సోదాలు చేశారు. పరిశ్రమ ప్రవేశ గేట్లు మూసి లోపల రికార్డులు పరిశీలించారు. లిక్కర్ నాణ్యత తెలుసుకోవడానికి నమూనాల సేకరించడం, లిక్కర్ రవాణా, లావాదేవీలు వగైరా అంశాలపై ఆరా తీసి తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. అయితే మీడియాను అనుమతించలేదు. వివరాలు చెప్పడానికి ఎవరూ ముందుకు రాలేదు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన డీపీఎన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు అఖిల్, బొర్రా రోహిత్

కశింకోట : కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలుకి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలో రజత, కాంస్య పతకాలను చెరొకటి కైవసం చేసుకొని తమ సత్తా చాటారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున 17 ఏళ్ల లోపు విభాగంలో పాల్గొన్న ఈ స్కూలు విద్యార్థులు అఖిల్ 60 కిలోల విభాగంలో రజత పతకం, బొర్రా రోహిత్ 51 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. వారిని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఆచంట రవి, పీడీ వేదుల ప్రభాకరరావు, స్కూలు కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వసతి గృహాల తనిఖీ



వడ్డాది కేజీబీవీలో తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రనాథ్

బుచ్చెయ్యపేట : మండలంలో గల వసతి గృహాలను చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఈ రాజేంద్రనాథ్ తనిఖీలు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆయన వడ్డాది ఎస్సీ, బీసీ వసతి గృహాలు, కస్తూర్బా గురుకుల గాంధీ వసతి గృహాలను తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థుల వసతిని, బాత్ రూంలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం గురించి వసతి సదుపాయాల గురించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి రోజూ విద్యార్థులకు అందిస్తున్న సేవలపైన, అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, వార్డెన్‌లు వెంకటరమణ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారంలోనూ పచ్చపాతం

'అనకాపల్లి మండలం రేబాక గ్రామ సచివాలయ పరిధిలో కాండ్రేగుల రామస్వామి అనే రైతుకు 2 ఎకరాల భూమి ఉంది. అందులో వరి పంట వేశాడు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో వరి పంట మునకకు గురైంది. రేబాక ఆర్‌బీకే అగ్రి అసిస్టెంట్, మండల వ్యవసాయ అధికారులు పంట నష్టం నమోదు చేసుకున్నారు. సోమవారం పంట నష్టం పరిహారం ప్రభుత్వం విడుదల చేసింది. జాబితాలో చూస్తే రైతు పేరు లేదు. ఆ భూమిని కౌలు చేస్తున్నట్టు స్థానిక జనసేన నాయకుడు పేరు మీద నష్ట పరిహారం మంజూరైంది. జనసేన నాయకుడు పేరు మీద అక్కడ భూమి లేకపోయినా కౌలుకు సాగు చేస్తున్నట్టు తప్పుడుతడకలుగా నమోదు చేసి సుమారు రూ.50 వేల పరిహారం కాజేశారు. అసలైన రైతు తనకు పరిహారం అందలేదని ఆర్‌బీకే అసిస్టెంట్‌ను, మండల వ్యవసాయ అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు'



పంట నష్ట పరిహారంలో లోపించిన పారదర్శకత

- అధికారుల ఇష్టారాజ్యం.. బాధిత రైతుల గగ్గోలు
- జిల్లా వ్యాప్తంగా 2,847 ఎకరాల పంట నష్టం నమోదు
- రూ.1.65 కోట్లు విడుదల

సాక్షి, అనకాపల్లి : ఇలా ఒకటి కాదు..రెండు కాదు.. జిల్లాలో పలు చోట్ల పంట నష్ట పరిహారంలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. అసలైన రైతులకు పంట నష్ట పరిహారం అందకుండా కాజేస్తున్నారు. కూటమి పార్టీ నాయకుల అండదండలతో అధికారులు ఇష్టారీతిగా అవకతవకలకు పాల్పడ్డారు. ప్రభుత్వ సాయం లేకపోవడంతో పెట్టుబడి కోసం అప్పులు చేసి సాగు చేస్తే తీరా భారీ వర్షాల కారణంగా పంట నీట మునిగింది. పంట నష్టపరిహారం అయినా వస్తుందని ఆశించిన రైతుల ఆశలు ఆడియాసలయ్యాయి.

పెట్టుబడి సాయంపై అడియాసలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి నేటి వరకూ రైతులను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో వరి పంట నీట మునిగి రైతుకు భారీ నష్టం మిగిల్చింది. జిల్లాలోని దాదాపు 2.5 లక్షల రైతులు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తే అప్పులు తీరతాయని ఆశతో చూస్తున్నారు. అయితే పెట్టుబడి సాయం అందకపోగా ఇపుడు పంట నష్ట పరిహారం కూడా అందకుండా చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే అరకొర పీఎం కిసాన్ రూ.2వేలు రెండు విడతల్లో అందించిన సాయం తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ రైతులకు ఎటువంటి సాయం అందలేదు.

జిల్లాలో పంట నష్టం వివరాలు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 2,847 రైతులకు పంట నష్టం నమోదు చేయగా, నష్ట పరిహారం రూ.1.65 కోట్లు విడుదల చేశారు. అత్యధికంగా అనకాపల్లి మండలంలో 826 మంది రైతులకు 208.8 హెక్టార్ల పంటకు నష్టపరిహారంగా రూ.52.2 లక్షలు అందించారు. మునగకపాక మండలంలో 635 మంది రైతులకు 109.02 హెక్టార్ల పంటకు రూ.27.26 లక్షల నష్టపరిహారం అందించారు.

మండలం	రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	నష్ట పరిహారం (లక్షల్లో)
అనకాపల్లి	826	208.8	52.2
అచ్యుతాపురం	39	8.09	2.02
బుచ్చెయ్యపేట	3	0.61	0.15
చీడికాడ	36	4.31	1.08
చోడవరం	323	49.73	12.44
దేవరాపల్లి	11	1.76	0.44
కశింకోట	132	32.64	8.16
కె.కోటపాడు	11	1.55	0.39
మాకవరపాలెం	6	1.24	0.31
మునగపాక	635	109.02	27.26
నక్కపల్లి	234	87.46	21.86
పరవాడ	3	1.44	0.36
పాయకరావుపేట	135	54.24	13.56
రాంబిల్లి	142	39.2	9.8
రావికమతం	34	6.58	1.64
రోలుగుంట	53	9.3	2.33
సబ్బవరం	143	20.18	5.04
ఎస్.రాయవరం	81	26.08	6.52
మొత్తం	2,847	662.23	165.56

నిజమైన రైతులకు అన్యాయం..



ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు భరోసా కింద రైతుకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. దాదాపు ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదు. రైతులు అప్పులు చేసి పంట వేశారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. రైతులకు ఇచ్చే నష్ట పరిహారం కూడా సవ్యంగా ఇవ్వలేదు. సుమారు 6 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగితే కేవలం 3 వేల ఎకరాల వరకే నమోదు చేశారు. అర్హత ఉన్న రైతులకు పరిహారం ఇవ్వకపోతే ఉద్యమిస్తాం. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం.

– పీలా బుజ్జి, తుమ్మపాల గ్రామం, రైతు సంఘం అధ్యక్షుడు

స్కూళ్ల నిర్వహణకు సగం నిధులే!

- ఎట్టకేలకు విడుదల చేసిన ప్రభుత్వం

విశాఖ విద్య: ఎట్టకేలకు పాఠశాల నిర్వహణ నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు చేరాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూళ్ల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. అయితే 2024–25 విద్యా సంవత్సరానికి లెక్క గట్టిన నిధుల్లో ప్రస్తుతం 50 శాతం మాత్రమే విడుదల చేశారు. మిగతా 50 శాతం ఎప్పట్లోగా మంజూరు చేస్తారనేది స్పష్టం చేయలేదు.

విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు దాటినా పాఠశాలల నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పాఠశాలల నిర్వహణ భారమంతా ప్రధానోపాధ్యాయులపైనే పడింది. కొన్ని చోట్ల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులంతా తమ వేతనాల్లోంచి కొంత మొత్తం పోగు చేసి.. ప్రాధాన్యత మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్కూల్ గ్రాంట్, ఎమ్మార్సీ గ్రాంట్ల మంజూరు కోసమని ఉపాధ్యాయ సంఘాలన్నీ రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలను సైతం అందజేశాయి. ఎట్టకేలకు స్పందించిన కూటమి ప్రభుత్వం వార్షిక నిర్వహణ నిధుల మొత్తంలో 50 శాతం మంజూరు చేసింది. విశాఖపట్నం జిల్లాలో 559 పాఠశాలలకు రూ.91.95 లక్షలు, అనకాపల్లి జిల్లాలో 1,392 పాఠశాలలకు రూ.172.075 లక్షలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,662 స్కూళ్లకు 152.05 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది.



ఉమ్మడి జిల్లాలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులున్న చంద్రంపాలెం హైస్కూల్

ఒక్కో ఎమ్మార్సీకి రూ.1.30 లక్షలు

ఉమ్మడి జిల్లాలోని మండల వనరుల కేంద్రాలకు కూడా నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రాల్లో ఎంఈవోలు వీటిలోనే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. వీటి నిర్వహణకు ఒక్కో దానికి రూ.1.30 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. వీటిలో ఎమ్మార్సీ నిర్వహణకు రూ.30 వేలు, టీఎల్‌ఎం కోసం రూ.30 వేలు, సమావేశాల రవాణా భత్యం కింద రూ.30 వేలు, కాంటిజెంట్ గ్రాంట్‌గా రూ.40 వేలు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో 11 ఎమ్మార్సీలకు రూ.14.30 లక్షలు, అనకాపల్లి జిల్లాల్లో 24 ఎమ్మార్సీలకు రూ.31.20 లక్షలు, అల్లూరి జిల్లాలో 22 ఎమ్మార్సీలకు రూ.28.6 లక్షలు విడుదలయ్యాయి.

భార్య చెల్లెలిపై లైంగిక దాడి

యలమంచిలి రూరల్: భార్య చెల్లెలిపై లైంగిక దాడికి పాల్పడ్డ ఓ కామాంధుడిపై యలమంచిలి పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై కె. సావిత్రి మంగళవారం రాత్రి మీడియాకు తెలియజేసిన వివరాల ప్రకారం పట్టణంలోని ధర్మవరం వీధి సీపీ పేటకు చెందిన బంగారు వెంకీ (19) భార్య ఇటీవల ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు సేవలందించడానికి 16 ఏళ్ల చెల్లెలు ఆమె వద్ద ఉంటోంది. భార్య గర్భంతో ఉన్న సమయంలో ఆమె చెల్లెలిపై కన్నేసిన నిందితుడు ఆమెకు మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాలిక ముభావంగా ఉండటం, స్కూల్‌కు వెళ్లకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె తల్లిదండ్రులు ఆరా తీయగా బాలిక తనపై జరిగిన అఘాయిత్యాన్ని చెప్పుకుంది. ఈ ఘోరంపై మంగళవారం రాత్రి తన తల్లిదండ్రులతో కలిసి బాలిక పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీనిపై పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై తెలిపారు.

ఏ బిడ్డా.. ఇది మా అడ్డా..

ఏ బిడ్డా.. ఇది మా అడ్డా.. ఉంటే ఇక్కడ మా షాపులే ఉండాలి. బ్రాందీ అమ్మినా, బీరు అమ్మినా మేమే అమ్మాలి. తాగేవాళ్లు కూడా మా దగ్గరే తాగాలి. వేరొకరు అమ్మడానికి వీల్లేదు.. మాకు మేమే పోటీ, మాకెరూ లేరు సాటి.... అంటూ మద్యం షాపులు దక్కించుకున్న కొంతమంది వ్యాపారులకు పచ్చ సిండికేట్ చేస్తున్న హెచ్చరికలు ఇవి. ప్రత్యర్థి షాపులు తాము ఏర్పాటు చేసే షాపులకు దరిదాపుల్లో ఉండకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి..



- లాటరీలో మద్యం దుకాణం దక్కినవారికి పచ్చ సిండికేట్ బెదిరింపులు
- ఎక్సైజ్ అధికారుల వత్తాసుపై ఆరోపణలు

నక్కపల్లి : లాటరీలో వేరొకరికి మద్యం దుకాణాలు దక్కడాన్ని మద్యం సిండికేట్ జీర్ణించుకోలేకపోతోంది. అధికార బలంతో నయానో భయానో ఇతరులకు దక్కిన దుకాణాలను తామే నిర్వహించుకునేలా వేస్తున్న ఎత్తుగడలు ఫలించడం లేదు. దీంతో ప్రధాన కూడళ్లలో తమ దుకాణాల దరిదాపుల్లో ఇంకే దుకాణం ఉండకూడదని హుకుం జారీ చేస్తున్నారు. మంత్రి అండదండలు తమకే ఉన్నాయని చెబుతూ షాపులు దక్కించుకున్న వారిపై రాజకీయంగా ఒత్తిడి తెస్తున్నారు. ఎస్.రాయవరం మండలంలో టీడీపీలో కీలకంగా ఉన్న ముఖ్యనేత నేతృత్వంలో ఏర్పాటైన సిండికేట్ ఓ ప్రజాప్రతినిధి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తిని సిండికేట్‌లో భాగస్వామిగా చేర్చుకుని అతని ద్వారా దుకాణాలు దక్కించుకున్న వారిపై ఒత్తిళ్లు తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అతనికి ఎక్సైజ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్.రాయవరం మండలానికి 7 మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. వీటిలో రెండు దుకాణాలు అడ్డురోడ్డు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసేందుకు రెండు వర్గాలు సిద్ధ పడుతున్నారు. ముహూర్తం చూసుకుని షాపులు కూడా ఏర్పాటు చేశారు. అమ్మకాలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభించలేదు. అయితే విక్రయాలు భారీగా ఉండే అడ్డురోడ్డు జంక్షన్‌లో తమకు దక్కిన షాపు మాత్రమే ఉండాలని, వేరొకరి షాపు ఉండకూడదంటూ సిండికేట్ పావులు కదుపుతున్నారు. అడ్డురోడ్డు జంక్షన్ పరిసర ప్రాంతాల్లో గతంలో రెండు మద్యం దుకాణాలు ఉండేవి. వీటిని ప్రభుత్వమే నిర్వహించడంతో ఏ సమస్య ఉత్పన్నం కాలేదు. కూటమి ప్రభుత్వం ఈ దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో డిమాండ్ పెరిగింది.

నిబంధనల సాకుతో...

ఎస్.రాయవరం మండలంలో ప్రధాన జంక్షన్ ఇదే. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల వారికి ప్రధాన వాణిజ్య కేంద్రం కూడా ఇదే. నిత్యం ఈ రెండు మండలాల్లో దాదాపు 20 గ్రామాల నుంచి సుమారు 2 వేల మందికిపైగా అడ్డురోడ్డు జంక్షన్‌కు వివిధ పనులు, మార్కెట్ అవసరాల కోసం వస్తుంటారు. ప్రధాన పర్యాటక కేంద్రమైన రేవు పోలవరం కూడా ఈ జంక్షన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ మద్యం విక్రయాలు చాలా ఎక్కువగా జరుగుతుంటాయి. రోజుకు సుమారు రూ.3 నుంచి 4 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరుగుతాయి. ఇటువంటి జంక్షన్‌పై పచ్చ సిండికేట్ కన్ను పడింది. ఇక్కడ తమ వర్గానికి చెందిన దుకాణం మాత్రమే ఉండాలని వేరొకరి దుకాణం ఉండడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేస్తున్నారు. పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన రెండు దుకాణాల్లో ఒకదానిని వేరొక చోటకు తరలించాలంటూ ప్రత్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నేషనల్ హైవేకి 200 మీటర్ల లోపు మద్యం దుకాణం ఉండడానికి వీల్లేదు. రెండు షాపులు 200 మీటర్ల తర్వాతే ఉన్నాయి. కానీ పలుకుబడి కలిగిన సిండికేట్ వారు ప్రత్యర్థి షాపును నిబంధనల సాకుతో వేరొక చోటికి తరలించాలని, అడ్డురోడ్డు దరిదాపుల్లో ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ రెండు రోజుల నుంచి ఒత్తిడి తెస్తున్నట్లు బోగట్టా. షాపును తరలించే బాధ్యత ఒక ఎక్సైజ్ ఉన్నతాధికారి భుజాన వేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. లైసెన్స్ కలిగిన దుకాణదారులను సమానంగా చూడాల్సిన ఎక్సైజ్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాల వ్యవహారంలో ప్రజాప్రతినిధి జోక్యం లేనప్పటికీ పీఏ మాత్రం అన్నీ తానై కథ నడిపిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రజాప్రతినిధికంటే పీఏ గొప్పోడు, పలుకుబడి కలిగినోడుగా చెలామణి అవుతున్నాడని అధికారపార్టీ నాయకులే బహిరంగంగా చెప్పుకోవడం విశేషం.

జోనల్ పోస్టు భర్తీకి ప్రభుత్వానికి నివేదిక

- 15–20 రోజుల్లో క్లోజ్డ్ కంపోస్టు వాహనాలు
- త్వరలోనే వివిధ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అనకాపల్లి : పట్టణ పరిధిలో జనాభాకు తగ్గట్టుగా రహదారి విస్తరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అనకాపల్లి జోనల్ కమిషనర్ పోస్టు విషయంలో ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరిగిందని, వివిధ శాఖల్లో ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. స్థానిక జోనల్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి, జోనల్ కార్యాలయం వద్ద కంపోస్టు యార్డును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జోనల్ కార్యాలయం వద్ద గార్బేజ్ డంపింగ్ యార్డు వల్ల దుర్వాసన వస్తుందని, వాసన బయటికి రాకుండా మోబైల్ కాంపెక్టర్ షెడ్ నిర్మాణం చేసి క్లోజ్డ్ కంపోస్టు సిస్టం ద్వారా చెత్తను తరలించే చర్యలు చేపడతామన్నారు. క్లోజ్డ్ కంపోస్టు వాహనాలు 15 నుంచి 20 రోజుల్లో అనకాపల్లికి వస్తాయన్నారు.

డెప్యూటేషన్‌పై జీవీఎంసీ సిబ్బంది

ఖాళీ పోస్టులను భర్తీ చేసే వరకూ జీవీఎంసీ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని డిప్యూటేషన్‌పై వారానికి మూడు రోజులు అనకాపల్లి జోనల్ కార్యాలయానికి వచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో 500 ఎంఎం డయా కలిగిన పైపులైన్లు అగనంపూడి నుంచి (అమృతా స్కీమ్ తాగునీరు) అనకాపల్లి వరకూ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అమృత్ 2.0 నిధులతో లక్ష్మీదేవిపేట 1000 కెఎల్ ఈఎల్‌ఎస్‌ఆర్ పనులు జరుగుతున్నాయని, జీవీఎంసీ విలీన గ్రామమైన కొండకొప్పాక హిల్లాక్ వద్ద రెండు ప్రాంతాల్లో 500 కెఎల్ సంపు, పంపుహౌస్, పైప్ లైన్లు నిర్మాణానికి కొత్తగా టెండర్లను పిలిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ పూడిక తీత పనులు త్వరలో చేపడతామన్నారు.



జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

నాసిరకం విత్తనాలతో పంటంతా పొల్లు..

- రైతుల ఆగ్రహం
- ఏపీ సీడ్స్ కంపెనీ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు
- రైతుల పొలాలను పరిశీలించిన ఏపీ సీడ్స్ ఫీల్డ్ అధికారులు



సరఫరా చేసిన ధాన్యం విత్తనాల సంచి

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేటలో నకిలీ విత్తనాల సరఫరాపై పలువురు రైతులు ఆగ్రహం చెందుతున్నారు. ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సరఫరా చేసిన స్వర్ణ రకం ఎంటీయు–7029టిఎల్ రకం ధాన్యం పలువురు రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి సాగు చేశారు. ప్రస్తుతం ఈ రకం ధాన్యం వేసిన రైతుల పొలాల్లో వరి పంట ఏపుగా పెరిగి వరి కంకులు వేస్తుంది. సగం వరి పంట కేళీలు రాగా మరికొంత వరి పంట కంకులు వేసిన ధాన్యం రాకుండా పొల్లుగా వస్తోంది. కొంత పంట కంకులు వచ్చినా ఎర్రబడి ఎండిపోతుంది. దీంతో రైతులు మోసపోయామని ప్రభుత్వంపై, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకి రూ.32 నుంచి రూ. 35 వేల వరకు పెట్టుబడులు పెట్టగా కనీసం తిండి గింజలు కూడా దొరకని పరిస్థితి వచ్చిందని గ్రామానికి చెందిన రైతులు సుంకర వెంకటరావు, పాతాళ శ్రీను, జక్కా పెంటారావు, మూటూరి శ్రీను, సూరిశెట్టి ప్రసాదరావు, సుంకరి అప్పలనాయుడు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల సరఫరాపై సోమవారం మండల వ్యవసాయాధికారి భాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు వరి విత్తనాలు సరఫరా చేసిన ఏపీ సీడ్స్ కంపెనీ సిబ్బంది దృష్టికి మండల వ్యవసాయాధికారి తీసుకెళ్లారు.



రైతుల పొలాల్లో వరి కంకులను పరిశీలిస్తున్న ఏపీ సీడ్స్ ఫీల్డ్ సిబ్బంది

మంగళవారం ఏపీ సీడ్స్ కంపెనీ, ఏపీ సీడ్స్‌కి ధాన్యం సరఫరా చేసిన అన్నదాత ఫీల్డ్ సిబ్బంది బుచ్చెయ్యపేట వచ్చి రైతుల వరి పొలాల్లో వేసిన వరి కంకులు, కేళీలను పరిశీలించి శాంపిల్స్ తీసుకెళ్లారు. నకిలీ విత్తనాలు సరఫరా చేయడంపై ఏపీ సీడ్స్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా ఖరీఫ్‌లో 17 బస్తాలు స్వర్ణ రకం విత్తనాలను రైతులకు అందించామన్నారు. ఏపీ సీడ్స్ ఫీల్డ్ సిబ్బంది పరిశీలించారని, రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో అందుబాటులో సీటీ స్కానింగ్


- ఇన్ పేషెంట్స్, అత్యవసర రోగులకు మాత్రమే



కొత్త సీటీ స్కానింగ్ మిషన్ వద్ద సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో అరబిందో కంపెనీ సీఎస్‌ఆర్ (రూ.కోటి 85లక్షల)నిధులతో ఏర్పాటు చేసిన సీటీ స్కానింగ్ మిషన్ ఇన్‌పెషెంట్ రోగులకు, అత్యవసర విభాగంలో రోగులకు మాత్రమే అందుబాటులోనికి తీసుకుని రావడం జరిగిందని వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పనిచేస్తుందని, ఇద్దరు టెక్నిషియన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏపీఎంఐడీసీ అధికారులు నియమించారని తెలిపారు. రోజుకు 10 నుంచి 20 మంది రోగులకు సీటీ స్కానింగ్ చేస్తున్నామని అన్నారు. కొత్తగా రేడియాలజిస్టు పోస్టుకు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు.

చట్టాలు మారాయ్



అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు

మార్పులతో త్వరితగతిన కేసుల విచారణ

ఆర్థిక నేరాల్లో బాధితులకు సొత్తు అందే అవకాశం

యలమంచిలి రూరల్: బ్రిటిష్ కాలంనాటి పాత చట్టాలు మారాయి. వాస్తవికతకు దగ్గరగా, సత్వర న్యాయానికి అనుకూలంగా మార్చిన కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయి. సుమారు 160 సంవత్సరాల నుంచి అమలవుతున్న పాత చట్టాలు ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా లేవని డాక్టర్ రణబీర్ సింగ్ కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు దేశ న్యాయవ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకువచ్చింది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ 1860) స్థానంలో భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొజీజర్ కోడ్ (సీఆర్‌పీసీ 1973) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (1872) స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం పేర్లతో చట్టాలు మారాయి. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు, చేర్పులతో వీటిని రూపొందించగా న్యాయ సంబంధ విధానాలను సరళతరం చేయడంతోపాటు తీవ్రమైన నేరాల్లో కఠినమైన శిక్ష విధించేలా సెక్షన్లలో మార్పులు చేశారు. చిన్న చిన్న నేరాలకు పాల్పడిన వారికి సమాజ సేవ శిక్ష విధించడం, నేరాల్లో డిజిటల్ సాక్ష్యాధారాలకు ప్రాధాన్యత, ఏ పోలీస్ స్టేషన్ నుంచైనా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేలా కొత్త చట్టాల ద్వారా వెసులుబాటు కల్పించారు. న్యాయ వ్యవస్థపై మరింత విశ్వాసం పెంపొందించడంతోపాటు కేసుల సత్వర పరిష్కారానికి ఈ నూతన చట్టాలు అవకాశం కల్పిస్తాయని న్యాయవాదులు, పోలీసు అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా కొత్తగా రూపొందించిన కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి వచ్చేశాయి. జిల్లాలో అన్ని ఠాణాల్లో కొత్త న్యాయ చట్టాలను అనుసరించి కేసుల నమోదు కూడా ప్రారంభమైంది. పోలీసు సిబ్బందికి ఇప్పటికే దశలవారీగా నూతన నేర న్యాయ చట్టాలపై శిక్షణ దాదాపుగా పూర్తయినట్టు ఆ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. నూతన చట్టాలతో సత్వర న్యాయం అందే అవకాశముంటుందని చెబుతున్నారు. జూలై 1 తర్వాత జరిగిన అన్ని నేరాలకు సంబంధించి కొత్త చట్టాల ఆధారంగా కేసులు నమోదవుతున్నాయి. సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా తెలుగులో ముద్రించిన కరపత్రాలను అందుబాటులోకి తెచ్చింది. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

డిజిటల్ సాక్ష్యాలైనా సరే..

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్)–2023ను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ –1973 స్థానంలో తీసుకొచ్చారు. బీఎన్‌ఎస్‌ఎస్ ద్వారా ఏడేళ్లు, అంతకన్నా ఎక్కువ జైలుశిక్ష విధించే నేరాలకు ఫోరెన్సిక్ విచారణ తప్పనిసరి చేశారు. అన్ని ట్రయల్స్ విచారణలు, ప్రొసీడింగ్‌లను ఆన్‌లైన్‌లో నిర్వహించే వెసులుబాటు లభిస్తుండగా, డిజిటల్ సాక్ష్యాలను సైతం ఆమోదిస్తారు. బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. అయితే ఫిర్యాదు చేసిన మూడు రోజుల్లోగా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలి. ఇక మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన పని లేకుండా నివసిస్తున్న చోటు నుంచే పోలీసుల సాయం పొందవచ్చు. ఐపీసీలోని 377, 497 సెక్షన్లు రద్దు చేశారు. బీఎన్ఎస్‌లో ప్రస్తుతం 531 సెక్షన్లు ఉన్నాయి. 177 నిబంధనలను మార్చారు. 14 సెక్షన్లను పూర్తిగా తీసేసి 39 సెక్షన్లు కొత్తగా చేర్చారు. 20 నేరాలను కొత్తగా చేర్చారు. భిక్షాటన, మానవ అక్రమ రవాణా కఠిన నేరంగా పరిగణించారు. నూతన చట్టాలపై అనుకూల, ప్రతికూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోక్సో కేసులు వేగిరం

పోక్సో కేసుల విచారణ కోసం ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసినా కేసులు తొందరగా తేలడం లేదు. కొత్తగా వచ్చిన చట్టాలతో నిందితులకు సాధ్యమైనంత తొందరగా శిక్షలు పడే అవకాశం ఉంది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు కేవలం రెండు నెలల్లోనే పూర్తి కావాలి. బాధితుల వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయాలి. వారు లేకుంటే మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి. పోక్సో కేసుల్లో వాంగ్మూలాన్ని పోలీసులే కాకుండా మహిళా ప్రభుత్వ అధికారి ఎవరైనా నమోదు చేయవచ్చు.

దీని వలన విచారణ వేగిరంగా జరిగి నిందితులకు శిక్ష పడుతుంది. కేసు నమోదు నుంచి న్యాయ విచారణ పూర్తయ్యేవరకు ప్రతి సమాచారం ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా బాధితులకు అందనుండడంతో పారదర్శకతకు పెద్దపీట వేసినట్టుగా ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు.



తెలుగులో ముద్రించిన కొత్త న్యాయ చట్టాల కరపత్రాలను విడుదల చేస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)

కొత్త చట్టాల్లోని కొన్ని ప్రధాన అంశాలు

- బాధితుడు/బాధితురాలు ఇకపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే జరిగిన సంఘటనపై ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. పోలీస్‌స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎవరైనా, ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసిన పక్షంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు.
- హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ నమోదు తప్పనిసరి చేశారు. దీంతో దర్యాప్తులో నాణ్యత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. బాధిత మహిళలు, చిన్నారులకు ఉచితంగా ప్రాథమిక చికిత్స, వైద్య చికిత్స అందించాల్సి ఉంటుంది.
- సమన్లు ఇకపై నేరుగా ఇవ్వాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లో పంపించవచ్చు.
- అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.
- కొత్త చట్టాల ద్వారా 15 రోజుల వరకు పోలీసు కస్టడీని అనుమతిస్తారు. అలాగే చట్టంలో 60 లేదా 90 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతి ఉంది.
- కొత్త చట్టాల ఆధారంగా సాక్షులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

కొత్త చట్టాలతో కేసుల సత్వర పరిష్కారం



కొత్త న్యాయ చట్టాలతో కేసులు త్వరితగతిన పరిష్కారం అయి, బాధితులకు సత్వర న్యాయం లభిస్తుంది. నేరాల సంఖ్యను తగ్గించడం, చట్టాలను మరింత బలోపేతం చేయడం, శాస్త్రీయ పద్ధతిలో మరింత మెరుగైన విధానంలో, నిర్దేశిత కాలపరిమితిలో దర్యాప్తు చేపట్టాల్సి ఉండడంతో బాధితులకు భరోసా కలుగుతుంది. నేరస్తులకు కఠిన శిక్షలు పడతాయి. అలాగే నూతన చట్టాల ద్వారా దర్యాప్తు సంస్థలకు ఎక్కువ అధికారాలు ఉన్నాయి. వివిధ కేసుల్లో బాధితులకు నేరుగా న్యాయం జరుగుతుంది. కాలయాపన ఉండదు. నేరాల నియంత్రణకు భరోసా కల్పించే విధంగా నూతన చట్టాలు ఉన్నాయి.

– కె.వి.సత్యనారాయణ, డీఎస్పీ, పరవాడ

సాంకేతిక పరిజ్ఞానం కీలకం



కొత్త చట్టాలతో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలకు సంబంధించిన నేరాల్లో శిక్షలు పెంచారు. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ వినియోగానికి సంబంధించి మార్పులు పొందుపరిచారు. మూక దాడులకు శిక్షలు పెంచారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్పు చేయడం మంచిదే. సామాన్యుడికి సుఖమయ జీవితం, స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటమే కొత్త చట్టాల ముఖ్య ఉద్దేశం.

– ఎస్.వి.ఎ.ప్రసాద్, న్యాయవాది, యలమంచిలి

జీరో ఎఫ్ఐఆర్‌తో ప్రయోజనం



జీరో ఎఫ్ఐఆర్ ద్వారా ఏ వ్యక్తి అయినా పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడానికి నూతన చట్టం అనుమతిస్తుంది. పోలీసులకు విస్తృత అధికారాలు కట్టబెట్టారు. కొత్త చట్టాలు అమలు చేసే విషయంలో అనేక సవాళ్లు ఎదురవుతాయి. పోక్సో కేసులు, మహిళలకు సంబంధించిన నేరాల్లో దర్యాప్తు వేగంగా పూర్తయి బాధితులకు సత్వర న్యాయం అందే అవకాశం ఉంది.

– శరగడం అప్పలనాయుడు, న్యాయవాది, యలమంచిలి

చీరల దుకాణం దగ్ధం

- రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం



మునగపాకలో అగ్నికి ఆహుతైన చీరల దుకాణం

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో మంగళవారం మధ్యాహ్నం చీరల దుకాణం అగ్నికి ఆహుతైంది. విద్యుత్ షాక్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు బాధితుడు లీలా భాస్కరరావు తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లికి చెందిన పెతకంశెట్టి లీలా భాస్కరరావు గత మూడు సంవత్సరాలుగా మునగపాక మెయిన్‌రోడ్డులో అమ్మ చౌక్ బజారు పేరిట చీరల అమ్మకం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. ఎప్పటిలాగానే మంగళవారం షాపు తెరిచి వ్యాపార లావాదేవీలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపులో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంట లను అదుపు చేశారు. కాగా ప్రమాదంలో సుమారు రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు లీలా భాస్కరరావు తెలిపారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని బాధితుడు కోరుతున్నారు. ఎస్‌బీఐ మేనేజర్ ప్రవల్లిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మాడుగుల: జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా మాడుగులకు చెందిన శ్రీనాదు శ్రీనివాసరావును నియమించారు. ఇటీవల శ్రీశైలం దేవస్థానంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభలో నూతన కార్యవర్గం ఎన్నికయింది. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ నియామక పత్రాలు అందజేశారు. దీంతో మంగళవారం మాడుగులలో మండలంలో గల ఆర్యవైశ్య సంఘ సభ్యులు శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్య వైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతుడు ఆటో డ్రైవర్ రాము

చోడవరం : మండలంలో వెంకన్నపాలెం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందగా, ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాలివి. చీడికాడ మండలం బి.సింగవరం గ్రామానికి చెందిన ఆటో అనకాపల్లి నుంచి తమ స్వగ్రామానికి వెళుతోంది. ఆటోలో ఆటో డ్రైవర్ దాడి రాముతో పాటు బి.సింగవరం గ్రామానికి చెందిన శరగడం లక్ష్మి, శరగడం పూర్ణ చంద్రరావు ప్రయాణం చేస్తున్నారు. ఆటో చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామ సమీపంలోకి వచ్చే సరిగా ఎదురుగా వెంకన్నపాలెం నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ రాము అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మి, పూర్ణచంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో రక్తపు మడుగులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులను అటుగా వెళుతున్న వాహన చోదకులు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అంబులెన్స్ వచ్చి క్షతగాత్రులిద్దర్నీ అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. వీరిలో లక్ష్మి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చోడవరం సీఐ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు చెప్పారు. మృతుడు ఆటోడ్రైవర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలియడంతో మృతుడి కుటుంబసభ్యులు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చూసి భోరున విలపించారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వాలి

అనకాపల్లి : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నా నీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయకపోవడం వల్ల జల వనరులు సముద్రంలో కలిసిపోతున్నాయని ఏపీ సమగ్ర అభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో రైతాంగ ప్రాంతీయ (ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల అభివృద్ధికి నిధుల కేటాయింపు, సుజల స్రవంతి) సదస్సులో మంగళవారం ఆయన మాట్లాడారు. నీటి నిల్వల ప్రాజెక్టులు ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయకపోవడం వల్ల తాగునీటికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు నీరు లేక యువతకు ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటుతనంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, నీటి నిల్వల ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లలో ఈడీ సోదాలు అన్యాయం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుల గృహాల్లో కూటమి ప్రభుత్వం కావాలని ఈడీ అధికారులతో సోదాలు నిర్వహించడం అన్యాయమని సమాజవాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురువయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రమేష్ ఫేస్‌బుక్‌లో బిల్డప్పుల కోసం అనకాపల్లిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పడం సిగ్గు చేటన్నారు. హైదరాబాద్‌లో బీజేపీ ఎంపీ సీఎం రమేష్ రూ.450 కోట్లు స్కామ్ చేసిన రోజులు గుర్తు తెచ్చుకోవాలని, అప్పుడు మీ ఇంట్లో ఈడీ సోదాలు చేయలేదా, మీ కంపెనీల్లో కూడా సోదాలు జరిగాయని, కేంద్రంలో బీజేపీని అడ్డుపెట్టుకుని పార్టీలో చేరలేదా, టీడీపీ, జనసేన పార్టీల నాయకుల భిక్షతో రమేష్ గెలిచారన్నారు. అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రహదారిపై దృష్టి పెట్టాలని, ఇతర పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు ఒక్కసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు. చిత్తశుద్ధి ఉంటే నర్సీపట్నం కేంద్రంగా స్వచ్ఛభారత్ పేరుతో బీజేపీ నాయకులు రూ. వందల కోట్ల స్కామ్ జరిగిందని, దీనిపై దర్యాప్తు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇసుక వసూళ్లపై స్పీకర్ సమాధానం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: గబ్బాడ డిపోలోనిది దొంగ ఇసుక అని చెబుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. స్పీకర్ చేసిన విమర్శలను మాజీ ఎమ్మెల్యే తిప్పికొట్టారు. గబ్బాడ డిపోలోని 48 వేల టన్నుల దొంగ ఇసుక తానే పట్టుకున్నానని, ఇసుక నిల్వ చేసిన దొంగకు రూ.18 కోట్లు ఫైన్ వేయించానని ప్రగల్భాలు పలుకుతున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇసుకకు డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారో వివరణ ఇవ్వాలన్నారు. అలాంటి దొంగ ఇసుకకు ట్రాక్టర్‌కు రూ.6,500 చొప్పున డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ డిమాండ్ చేశారు. వసూలు చేసిన డబ్బులు ఎవరికి వెళ్తున్నాయో సమాధానం చెప్పాలన్నారు. ఇసుక ఫ్రీగా ఇచ్చేస్తే ట్రాన్స్‌పోర్టు చార్జీలు మాజీ ఎమ్మెల్యే బాబు ఇస్తాడా.. మీతాత ఇస్తాడా అని అయ్యన్నపాత్రుడు మాట్లాడారన్నారు. ఇసుక రాజమండ్రి నుండి నర్సీపట్నం తీసుకువచ్చినందుకు టాన్స్‌పోర్టు చార్జీలు మీబాబు ఇచ్చాడా అని అయ్యన్నపాత్రుడుని మాజీ ఎమ్మెల్యే ఎదురు ప్రశ్నించారు. తనకు నమస్కారం పెట్టాల్సి వస్తుందనే జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రావటం లేదని అయ్యన్నపాత్రుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, జగనన్న నమస్కారం చేసేది.. స్పీకర్ చైర్‌కు అన్న విషయాన్ని అయ్యన్నపాత్రుడు తెలుసుకోవాలన్నారు. అయ్యన్న, ఆయన పార్టీ నాయకులు గౌరవంగా మాట్లాడితే తాను కూడా గౌరవంగా మాట్లాడతానని గణేష్ పేర్కొన్నారు.

ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : జిల్లాలో ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి ఐదో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. ఇప్పటికే నాలుగు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 28న ప్రభుత్వ ఐటీఐలకు, 30న ప్రైవేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎక్కడ దరఖాస్తు చేశారో అక్కడే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అనకాపల్లి: బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి పెద్ద పీట వేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జిల్లా ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు నిబంధనలు అనుసరించి జిల్లాలో నేటి వరకూ బస్ కాంప్లెక్స్‌ల్లో తల్లిపాల కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థపై తక్షణమే చర్యలు తీసుకుని, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులంతా సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు కలిసి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి కె.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణాధికారి ఎం.రమేష్, అనకాపల్లి డిపో మేనేజర్ రవిచంద్ర, నియోజకవర్గ సీడీపీవో పి.ప్రభావతి, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన నిందుతుడితో పోలీసులు

చీడికాడ: మండలంలో అప్పలరాజుపురం కాటా వద్ద వాహనాలను తనిఖీ చెస్తుండగా ఒక వ్యక్తి నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చెసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అశ్విన్ సోలోమెన్ అనే వ్యక్తి సోమవారం సాయంత్రం అప్పలరాజుపురం కాటా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా తనిఖీ చేశామన్నారు. అతని వద్ద ఉన్న బ్యాగులో 4 కిలోల గంజాయిని గుర్తించి ఆదుపులోకి తీసుకుని మంగళవారం చోడవరం కోర్టులో ప్రవేశపెట్టామన్నారు. ముంచంగిపుట్టులో గంజాయి కొనుగోలు చేసి కోణం మీదుగా అప్పలరాజుపురం చేరుకున్నాడన్నారు.

తుపాను ఎఫెక్ట్.. పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : దానా తుపాను కారణంగా వాల్తేర్ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

23న రద్దయిన రైళ్లు : కన్యాకుమారి–డిబ్రూగడ్(22503) ఎక్స్‌ప్రెస్, సిల్చార్–సికింద్రాబాద్ (12514) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–భువనేశ్వర్ (17016) విశాఖ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి–హౌరా(12868) ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– షాలిమర్(22826) షాలిమర్ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి–భువనేశ్వర్(12897)ఎక్స్‌ప్రెస్, కేఎస్ఆర్ బెంగళూరు–భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు– గౌహతి (12509) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–హౌరా(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా(12704)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (22888)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (12864) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సూరత్–బ్రహ్మపూర్(09059) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, కామాఖ్య– ఎస్ఎంవీ బెంగళూరు(12552) ఏసీ ఎక్స్‌ప్రెస్, డిబ్రూగడ్–కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్, గాంధీదాం–పూరీ(22973) ఎక్స్‌ప్రెస్

24న రద్దయిన రైళ్లు : సికింద్రాబాద్–మాల్దా టౌన్ (03429) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరునల్వేలి–షాలిమర్(06087) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–సికింద్రాబాద్(12703)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఖరగ్‌పూర్–విల్లుపురం (22603) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–హైదరాబాద్ (18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు(22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎస్ఎంవీటి బెంగళూరు (12863) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్, హౌరా – ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పాట్నా–ఎర్నాకుళం (22644) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–ఎంజీఆర్‌చెన్నై సెంట్రల్ (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, రూర్కెలా– గుణుపూర్(18117) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, కటక్–గుణుపూర్(08421) మెము ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్, పలాస–విశాఖపట్నం(07471) మెము స్పెషల్, భువనేశ్వర్–జునాగడ్(20837) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, పూరీ–గుణుపూర్(18417) ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్(20842) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–డిఘా(22874) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా (18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్(22820) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, విశాఖ–బ్రహ్మపూర్ (08532) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీర్ చెన్నై సెంట్రల్–షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సాంత్రగచ్చి (22808) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటి బెంగళూరు–ముజఫర్‌పూర్(15227) ఎక్స్‌ప్రెస్, జునాగడ్‌రోడ్–భువనేశ్వర్ (20838) ఎక్స్‌ప్రెస్, జగదల్‌పూర్–భువనేశ్వర్ (18448) హిరాకండ్ ఎక్స్‌ప్రెస్, తంబరం–సంత్రగచ్చి(06095) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు– హౌరా(12246) దురంతో ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–పూరీ(18418) ఎక్స్‌ప్రెస్, పూరీ–తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్, విశాఖ–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, విశాఖ–పలాస(07470) మెము, విశాఖ–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్.

25న రద్దయిన రైళ్లు: బ్రహ్మపూర్–సూరత్ (09060) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, డిఘా–విశాఖపట్నం (22873) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–విశాఖపట్నం (22819) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్–విశాఖపట్నం(08531) పాసింజర్ స్పెషల్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్, బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–కటక్(08422) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–అమృతసర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–పూరీ(18418) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, పూరీ–గుణుపూర్(18417) ఎక్స్‌ప్రెస్.

పిడుగుపాటుకు ఒకరు మృతి



కొండబాబు (ఫైల్)



పిడుగుపాటుకు మృతి చెందిన కొండబాబు

కోటవురట్ల: రాట్నాల పాలేనికి చెందిన కాకర కొండబాబు(48) సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందాడు. నిరుపేద అయిన కొండబాబుకు వరాహనది ఆవల కొంచె పొలం ఉంది. అందులో వరిచేను సాగు చేశాడు. సోమవారం మధ్యాహ్నం వరి చేనుకు పిండి వేయడానికి వెళ్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో పిడుగుపాటుకు గురయ్యాడు. తలపై పడడంతో శరీరం అంతా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కొండబాబు భార్య శాంతి అచ్యుతాపురంలోని బ్రాండిక్స్‌లో పని చేస్తోంది. పెద్ద కుమారుడు ప్రసాద్ కారు డ్రైవర్‌గా చేస్తున్నాడు. శాంతి బ్రాండిక్స్ కంపెనీ నుంచి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వస్తూ కొండబాబుకు ఫోన్ చేసింది. ఎంతకూ ఫోన్ తీయకపోవడంతో పెద్ద కుమారుడు ప్రసాద్‌కు ఫోన్ చేసి నాన్న ఫోన్ తీయడం లేదు, ఏం జరిగిందో చూడు అనే సరికి తన మిత్రులు, కుటుంబ సభ్యులతో వెతకడం ప్రారంభించారు. వరాహ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తొలుత నదిలో గల్లంతయ్యాడని కంగారు పడ్డారు. పొలానికి వెళ్లి వెతగ్గా తెల్లవారు జామున ఒంటి గంట సమయంలో పొలం గట్టుపై వెల్లకిలా పడిపోయి ఉన్నాడు. వెంటనే తిప్పి చూడగా ఒళ్లంతా కాలిన గాయాలలో అప్పటికే ప్రాణాలు కోల్పోయి ఉన్నాడు. సాయంత్రం పిడుగులు పడ్డాయని, ఆ సమయంలోనే మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతునికి భార్య శాంతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

క్లుప్తంగా

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు



తోపుడు బళ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ వెంకట నారాయణ

అనకాపల్లి: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ సూచించారు. స్థానిక మెయిన్‌రోడ్డు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జీవీఎంసీ జోనల్ పరిధిలోని తోపుడు బళ్ల వ్యాపారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రహదారులపై తోపుడు బళ్ల పెట్టడం తగదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా మెయిన్‌రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, ఉదయం, సాయంత్రం సమయాల్లో తోపుడు బళ్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ డి.శేఖరం, తోపుడు బళ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 409 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,010	5,610
మొదటి రకం	4,580	5,680
రెండో రకం	3,840	4,750
మూడోరకం	3,400	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
వీక్షణం	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
రివైండ్(మాట్నీ, సెకండ్ షో)	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్- 3 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 9703619706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చును.

సాగునీటి కాలువలు దయనీయం

పేరుకుపోయిన పూడిక ● వరుస తుపాన్లతో ఆందోళనలో రైతులు



పూడికతో నిండిపోయిన శంకరం పులికాలువ

తుమ్మపాల: మండలంలో సాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకమవుతోంది. జలాశయాల్లో నీరు ఉన్నా పంట పొలాలకు చేరని దుస్థితి నెలకొంది. మరో వైపు వరుస తుపాన్లు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. సాగునీటి కాలువల్లో పూడిక తీతకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

మండలంలో 32 గ్రామాలతో పాటు ఆవఖండం, సాత్-1, 2, పల్లపు భూములతో కలిపి దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. సీతానగరం, వెంకుపాలెం, తుమ్మపాల, దిబ్బపాలెం, ఊడేరు, బవులువాడ, తగరంపూడి, కుంచంగి, కూండ్రం, వేటజంగాపాలెం, సుందరయ్యపేట, శంకరం, రేబాక, మార్టూరు, మామిడిపాలెం, పాపయ్యపాలెం, మాకవరం, చింతనిప్పుల అగ్రహారం, ఆవఖండం భూముల్లో అత్యధిక శాతం విస్తీర్ణం వరి సాగవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గ్రామాల్లో వరి పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ తుఫాన్ ప్రభావ హెచ్చరికలు జారీ కావడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల వర్షాలకు నీటి ప్రవాహం ఎక్కడికక్కడే నిలిచిపోవడంపై అధికారులు నివేదికలతోనే సరిపెట్టారని, కార్యచరణ ప్రారంభించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడికతో నిండిపోయిన సాగునీటి కాలువులు

మండలంలో తగరంపూడి, సీతానగరం చానళ్లతో పాటు చెర్లోపల్లి, యల్లయ్య కాలువ, పులి కాలువ, కుంచంగి ఎదురుగెడ్డ, రేబాక ఎదురుగెడ్డ దొంగగెడ్డ, మరికొన్ని కాలువలు అధ్వానంగా మారాయి. ఆక్రమణలతో వెడల్పు, పూడిక తీయకపోవడంతో లోతు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. కాలువల నిర్వహణకు ప్రభుత్వం నిధులు వెచ్చించడం లేదు.

రూ.2.40 లక్షలతో పూడికతీత సరిపెట్టేశారు..

సాగునీటి కాలువలపై ప్రత్యేక కార్యచరణ అంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇరిగేషన్ అధికారులతో సమీక్షలు చేపట్టి ఇప్పటికి రెండు నెలలు దాటుతోంది. కాలువల్లో పూడిక తీతకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందంటూ కూటమి నాయకులు చేసిన ప్రచారాలు గాలిమూటలుగానే మిగిలిపోయాయి. గత నెలలో కురిసిన వర్షాలకు ముంపునకు గురైన శంకరం, తుమ్మపాల పొలాల్లో స్థానిక ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడుగు పెట్టకుండానే హామీలు గుప్పించారు. చివరకు మండలంలో పులి కాలువకు రూ.80 వేలు, తగరంపూడి చానల్‌కు రూ.80 వేలు, చెర్లోపల్లి కాలువకు రూ.80 వేలు ఖర్చు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఈ నిధులతో నామమాత్రంగా కాలువల నిర్వహణ పనులు చేపట్టారు.

సాగునీటి కాలువలను శుభ్రం చేయాలి



గత నెలలో కురిసిన వర్షాలతో పంట ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయాం. మళ్లీ ప్రభుత్వం తుపాను హెచ్చరికలు చేయడంతో కాపాడుకున్న పంట నష్టం జరిగితే మా పరిస్థితి దారుణంగా మారుతుంది. కాలువల్లో పూడిక తీత తీయకపోవడంతో వర్షం నీరు దిగువకు పారడం లేదు. సాగునీటి కాలువలను కనీసం ఐదేళ్లకు ఒక సారైనా శుభ్రం చేయాలి.

– మంత్రి నాని, రైతు, రేబాక గ్రామం

అల్ప పీడనం హెచ్చరికలతో అప్రమత్తం

కశింకోట: బంగాళాఖాతంలో అల్ప పీడనం, దానా తుపాను హెచ్చరికల దృష్ట్యా విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ జి.ప్రసాద్ ఓ ప్రకటనలో ఆదేశించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అనకాపల్లి కార్యాలయంలో సెల్ నంబర్ 9490610022తో 24 గంటలు పని చేసే విధంగా సిబ్బంది ఏర్పాటు చేసి కంట్రోల్ రూం అందుబాటులో ఉంచామన్నారు. వర్షాల వల్ల తెగిపడిన విద్యుత్ వైర్లు, తడిసిన విద్యుత్ స్తంభాలను ప్రజలు నేరుగా తాకరాదన్నారు. అవకాశం ఉన్నంత వరకు రబ్బరు చెప్పులను ధరించడం ఉత్తమమన్నారు. వ్యక్తిగత భద్రత, అన్నింటి కంటె ప్రాణం కాపాడుకోవడం ముఖ్యమన్నారు. వర్షాల వల్ల ఏదైనా విద్యుత్ అంతరాయం, సమస్యలు తలెత్తినచో సమీపంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని గాని, టోల్ ఫ్రీ నెంబర్ 1912కు గాని, కంట్రోల్ రూంకు గాని ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

డీఎస్‌ఎన్‌ఎల్‌యూలో ఫ్యాషన్, మీడియా చట్టాలపై సదస్సు



నమ్రత పహ్వాను సత్కరిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: ఫ్యాషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ చట్టాలపై చైతన్యం, ఆయా రంగాల్లో న్యాయపరమైన అభ్యాసం ద్వారా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ప్రముఖ న్యాయవాది నమ్రత పహ్వా అన్నారు. ఫ్యాషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ లా అధ్యయనానికి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్‌ఎన్‌ఎల్‌యూ) ఒక సెంటర్(సి-ఎఫ్‌ఏఎంఈ)ను ప్రారంభించింది. ఈ మేరకు ఇంట్రడక్షన్ టు ఫ్యాషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ లా అనే అంశంపై మంగళవారం ఒక రోజు సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో ముఖ్య అతిథిగా ఫ్యాషన్ లా, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలలో ప్రముఖ న్యాయవాది అయిన నమ్రత పహ్వా మాట్లాడారు. ఏదైనా ప్రసిద్ధ సంస్థల సృజనాత్మకతను ఇతరులు దొంగిలించినట్లయితే ఒరిజినల్ సృష్టికర్తల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాటిని పరిరక్షించేందుకు నిర్దిష్టమైన చట్టాలు లేనప్పుడు ఇప్పటికే ఉన్న ఐపీఆర్ చట్టాలను ఉపయోగించుకుని న్యాయస్థానాలు ఎలా వివాదాలను పరిష్కరిస్తాయో వివరించారు. దేశంలో మొదటి సారిగా ఈ రంగ సమస్యలపై ఒక అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసినందుకు యూనివర్సిటీ యాజమాన్యాన్ని అభినందించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ హక్కులు, ఫ్యాషన్ ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత ఎంపిక అనేది ప్రతి వ్యక్తి హక్కని, ఆ హక్కును ప్రస్తుత చట్టాల ద్వారా తప్పనిసరిగా రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సేవలో సాయిరాం ప్రతిభ



సాయిరాంను సత్కరిస్తున్న కళావేదిక ప్రతినిధులు

పరవాడ: కవితాగానం/కళా ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్‌ఎస్ సాయిరాం పేరును అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ(తానా) బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసినట్లు కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కన్వెన్షన్ హాలులో శ్రీశ్రీ కళావేదిక, అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళాజాతర కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సాయిరాంను సత్కరించి కళావేదిక కార్యదర్శి డా.టి.పార్థసారథి, అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్ అందించారు. తెలుగు సాహితీ కళారంగ చరిత్రలో 24 గంటల నిర్విరామ సాహితీ ప్రదర్శనలో ప్రతిభకు గాను తన పేరును ఎంపిక చేసినట్లు సాయిరాం తెలిపారు. సాయిరాంను పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.హారిక, డా.జయశ్రీకరిష్మా, సిబ్బంది వి.వెంకటరావు, పీహెచ్‌ఎన్ జానకీరామన్, ఆనందకుమార్, పీవీ రత్నం, ఎం.సతీష్ అభినందించారు.

ఉల్లాస్‌పై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన



మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సభ్యులకు ఉల్లాస్(సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన-యూఎల్‌ఎల్‌ఏఎస్) పథకం గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో నిరక్షరాస్యులకు, చదువు మధ్యలో ఆపేసిన వయోజనులకు ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య అందించేందుకు వీలుగా స్థానిక మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. కుటుంబ సంక్షేమంతోపాటు, వయోజన విద్యను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, ఏరియా కో ఆర్డినేటర్ రాజేశ్వరి, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, మండలంలోని మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

సబ్బవరం: బాలిక అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరానికి చెందిన మాటూరి రూప నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఈ నెల 19న స్కూల్‌కు అని చెప్పి, ఇంటి నుంచి బయల్దేరింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు ప క్కల ప్రాంతాల్లో గాలించడంతో పాటు, బంధువుల ఇళ్లలోవాకబు చేశారు. అయినప్పటికీ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రామారావు ఫిర్యాదు చేసినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు. ఒక వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బ్రిడ్జిపై రక్షణ గోడను పునర్నిర్మించాలి



రక్షణ గోడను నిర్మించాలని నిరసన తెలియజేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేత కొణతాల హరనాథ్‌బాబు

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేట ఎల్లయ్య కాలువలో పూడిక తీత పనులు నిమిత్తం వేల్పులవీధి సర్వకాంబ పార్కు బ్రిడ్జిపై తొలగించిన రక్షణ గోడను తక్షణమే నిర్మించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక బ్రిడ్జి వద్ద మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సుమారుగా ఏడాది పాటు బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో భయం భయంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు.

నిలకడగా తాండవ నీటి మట్టం

నాతవరం: తాండవ రిజర్వాయర్ నీటి మట్టంపై దానా తుపాను ప్రభావం లేదని ప్రాజెక్టు జేఈ ప్రేమకుమార్ అన్నారు. ప్రాజెక్టులో మంగళవారం నాటికి 377.2 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు నుంచి పంట కాలువల ద్వారా అయకట్టు భూములకు రోజుకు 550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులుగా పరిగణిస్తామన్నారు.

రహదారి విస్తరణ కోసం నిరసన



పెరుగుబజార్ జంక్షన్ వద్ద నిరసన తెలియజేస్తున్న బల్లా నాగభూషణం, తదితరులు

అనకాపల్లి: స్థానిక పెరుగుబజార్ కూడలి నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకూ నిలిపిపోయిన రహదారి విస్తరణ పనులు తక్షణమే చేపట్టాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేకు స్థానిక పెరుగుబజార్ జంక్షన్ వద్ద మంగళవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవో బత్తుల సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గతేడాది పెరుగుబజార్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకూ రహదారి అభివృద్ధికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి, మధ్యలో రోడ్డు వేయకపోవడంతో వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, బొడ్డు సోమరాజు, ఉడా నాగేశ్వరావు, కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమ, పొడ తెగులు నివారణకు చర్యలు

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో సుడిదోమ, పొడ తెగులు ఆశించే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెగులు నివారణకు అసిఫేట్ 1.5 గ్రా, ప్రోపికోనజోల్ 1 మీ.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు ఆశించవచ్చని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రా. లేదా అసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తల్లి పురుగు కనిపిస్తే ట్రైకోగ్రామా గ్రుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20,000 చొప్పున విడుదల చేయాలని తెలిపారు. రసాయనిక మందులు కాకుండా జీవ నియంత్రణ చేసే రైతులు బవేరియా బెసియానా(బీబీ5ఏ)ను లీటరు నీటికి 5 గ్రా.ల చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. కంకినల్లి ఆశిస్తే ప్రోఫెఫాస్ 2. మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకుకు కాండం తొలిచే పురుగు వచ్చే అవకాశం ఉందని, నివారణకు ఎకరాకు 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి. గుళికలను వేయాలన్నారు. ఖాళీగా ఉన్న పొలాల్లో రాగల వర్షాలను ఉపయోగించుకుని అధిక దిగుబడినిచ్చే ఉలవ రకాలైన పిడియం-1, క్రీడ 1-18ఆర్, ఏటీపీహెచ్‌జీ-11ను వెదజల్లే పద్ధతిలో 12-15 కిలోలు, వరుసలలో గొర్రుతో విత్తే పద్ధతిలో ఎకరాకు 8-10 కిలోలు చొప్పున వరుసల మధ్య 30 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ దూరంలో విత్తుకోవాలని సూచించారు. రబీలో వేసే మొక్క జొన్నలో అధిక దిగుబడినిచ్చే డీహెచ్‌ఎం 117, డీహెచ్‌ఎం 111, బయో 9637(ప్రైవేటు రకం) వంటి రకాలను ఎంపిక చేసుకుని ఎకరాకు 8 కిలోల చొప్పున వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, ఎం.విశాలాక్షి, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 105 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కశింకోట: కశింకోటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు విశేష ఆదరణ లభించింది. 105 మంది రైతులు అర్జీలు అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న కల్యాణ మండపంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో భూముల వివరాల్లో హెచ్చుతగ్గులు, తప్పులు వగైరా సవరించాలని కోరుతూ రైతులు అర్జీలు సమర్పించారు. రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, సర్వేయర్ రామారావు, ఆర్ఐ రమేష్, స్థానిక వీఆర్‌వోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు



దెబ్బతిన్న కారు ముందు భాగం

మాకవరపాలెం: రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎలాంటి గాయాలు లేకుండా లోపల ఉన్న వారు బయటపడ్డారు. మండలంలోని తామరం నుంచి మాకవరపాలెం శ్రీదేవి ఫంక్షన్ హాల్ వరకు సుమారు కిలోమీటరున్నర మేర ఐదేళ్ల క్రితం రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించారు. కానీ వీటికి రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్‌కు డివైడర్లు కనిపించక వాహనాలు వీటిని ఢీ కొడుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా స్థానిక బస్టాండు వద్ద కారు డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతినగా లోపల ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వీటి నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.